6వ రోజుకు అంగన్వాడీల సమ్మె

విశాలాంధ్ర-మేడికొండూరు: అంగన్వాడి కార్యకర్తల తమ డిమాండ్ల సాధన కోసం ఆరవ రోజు తమ సమ్మెను కొనసాగించారు. ఈనెల 11వ తేదీ సాయంత్రం తమ విధులు ముగించుకుని కార్యాలయానికి తాళాలు వేసి 12వ తేదీ నుండి సమ్మెలో పాల్గొన్నారు. పేరేచర్ల లోని నరసరావుపేట రోడ్ లో గల అంగన్వాడి సెంటర్‌తో పాటు ఎల్ఎస్ఎస్ కాలనీ, శివ పార్వతి కాలనీ, ఉర్దూ స్కూల్ ఆవరణలో ఉన్న అంగన్వాడి సెంటర్లో ఆదివారం అంగన్వాడి సూపర్వైజర్‌తో పాటు సచివాలయ సిబ్బంది తాళాలు పగలగొట్టి తమ స్వాధీనం చేసుకున్నారు. కొన్ని ప్రైవేటు బిల్డింగుల్లో ఉన్న అంగన్వాడి సెంటర్ల తాళాలు పగలగొట్టడాన్ని అంగన్వాడీ కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకించారు. తమ సొంత పూచికత్తు పై బిల్డింగులు అద్దెకు తీసుకున్నట్లు ఆయా కార్యకర్తలు తెలిపారు.

అసత్య ప్రచారంపై ఫిర్యాదు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: తన ఎదుగుదలను, అభివృద్ధిని చూసి ఓర్వలేక తనపై లేనిపోని అసత్యాలు ప్రచారం చేస్తూ తనను ఇబ్బంది పెట్టాలని చూస్తున్న వే టు న్యూస్‌పై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆర్పీఐ నేత బోరుగడ్డ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తనపై లేనిపోని అసత్యాలను ప్రచారం చేస్తూ తప్పుడు కథనాలను ప్రచురిస్తున్నారని, అసత్య ప్రచారాల వ్యవహారాన్ని ఢిల్లీలో తేలుస్తానని, ఎట్టి పరిస్థితులలో వదిలే ప్రసక్తి లేదని అనిల్ కుమార్ స్పష్టం చేశారు. దీనిపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ విచారణకు ఆదేశించినట్టు తెలిపారు.

మునుపెన్నడూ లేనంత మెరుగ్గా సోచ్ రెడ్ డాట్ సేల్

గుంటూరు: మునుపెన్నడూ లేనంత మెరుగ్గా సోచ్ రెడ్ డాట్ సేల్ తిరిగి వచ్చింది. వివిధ రకాల ఎత్నిక్ వేర్ లుక్‌లను 50 శాతం తగ్గింపుతో అందిస్తోంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ రెడ్ డాట్ సేల్ నుండి, చీరలు, సల్వార్ సూట్లు, కుర్తాలు, కుర్తా సెట్‌లు, డ్రెస్ మెటీరియల్‌లు, ట్యూనిక్స్, కఫ్తాన్‌లతో సహా అన్ని సోచ్ లుక్‌లను ఎంపిక చేసుకోవడానికి సిద్ధంగా ఉండండి. ఈ ప్రత్యేక విక్రయం కేవలం షాపింగ్ అనుభవం మాత్రమే కాకుండా విస్తృత శ్రేణిలో 50 శాతం వరకు తగ్గింపును అందిస్తోంది. రెడ్ డాట్ సేల్ రూ. 749 నుండి ఎంపికల శ్రేణిని అందజేస్తుంది.

23 లక్షలకు పైగా స్టైళ్లలో మింత్రా ఈవోఆర్ఎస్-19

గుంటూరు: భారతదేశంలోని అతిపెద్ద ఫ్యాషన్ షాపింగ్ మహోత్సవాలలో ఒకటైన మింత్రా ఎండ్ ఆఫ్ రీజన్ సేల్ 19వ ఎడిషన్, వివాహాలు, పార్టీలు, హాలిడే సీజన్‌లో లక్షలాది మంది ఫ్యాషన్ ఫార్వర్డ్ షాపర్‌లను ఆకర్షించేలా ప్రారంభించబడింది. ఇందులో 6000కి పైగా ప్రసిద్ధ అంతర్జాతీయ, దేశీయ, డి2సి బ్రాండ్‌ల నుంచి ఫ్యాషన్, బ్యూటీ, జీవనశైలిలో 23 లక్షలకు పైగా ఉత్పత్తులున్నాయి. ఈవోఆర్ఎస్ 19 ఎడిషన్ అసమానమైన స్థాయిలో ఉన్నతమైన షాపింగ్ అనుభవాన్ని అందిస్తుంది.

అమరావతినే రాజధానిగా కొనసాగించాలి

విశాలాంధ్ర-తాడికొండ : అమరావతినే రాజధానిగా కొనసాగించాలని సీపీఐ, సీపీఎం, టీడీపీ నాయకులు కోరారు. మండల కేంద్రమైన తాడికొండ అమరావతి దీక్ష శిబిరం వద్ద నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ విధానాలను తప్పుపడుతూ ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ 1461 రోజులుగా అమరావతి రైతులు వివిధ రూపాలలో ఆందోళనలు కొన సాగించిందని తెలిపారు. సమస్యను పరిష్కరించకపోగా రైతులు, మహిళలు, ఉద్యమకారులపై నిర్బంధం కేసులు పెరిగాయన్నారు. జై అమరావతి.. జై జై అమరావతి.. ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని... ఆంధ్రుల రాజధాని అమరావతి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు, సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు బండ్ల కోటేశ్వరరావు, బి.హరిబాబు, ధూళిపాళ్ల యేసు బాబు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టారు

విశాలాంధ్ర-తాడికొండ : ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలో పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఆది వారం 18 అంగన్‌వాడీ కేంద్రాలను తాళాలు పగలగొట్టి తెరిపించారు. ఒక పక్క తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తాడికొండ పోలీస్ స్టేషన్ సమీపంలో ఆరు రోజులుగా దీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వ విధానాలను తప్పు పడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను మాత్రమే తాము అడుగుతున్నామని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ప్రభుత్వ చర్య దుర్మార్గం

విశాలాంధ్ర, తెనాలి : అంగన్వాడి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పోరాటం చేస్తున్న అంగన్వాడీ ఉద్యోగులకు వ్యతిరేకంగా జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు వేసిన తాళాలను పగలగొట్టమని అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో తెనాలి మండలం, కొలకలూరు గ్రామంలోని యస్.టి. కాలనీ అంగన్వాడి కేంద్రానికి చేరుకున్న అధికారులను తెలుగుదేశం, జనసేన పార్టీ శ్రేణులు తాళాలు పగలగొట్టకుండా అడ్డుకున్నారు. వైసిపి ప్రభుత్వం ఇలా చేయడం చాలా దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. హామీలను నెరవేర్చకుండా అంగన్వాడీలకు అన్యాయం చేస్తున్నారని జగన్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. దీక్షా శిబిరంలో ఆయాలు, టీచర్లు మోకాళ్ళ మీద నిలబడి నిరసన తెలియజేశారు.

మందిరాన్ని సందర్శించిన సుచరిత

విశాలాంధ్ర-తాడికొండ : పత్తిపాడు శాసనసభ్యులు, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత ఆదివారం రాత్రి తాడికొండలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరాన్ని సందర్శించారు. తొలిసారిగా తాడికొండ రావటంతో గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. షిరిడి సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు అందుకున్నారు. కొద్ది నిమిషాలు నాయకులు కార్యకర్తలతో ముచ్చటించారు. అనంతరం స్థానిక అడ్డరోడ్డు సెంటర్‌లో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆమె వెంట మేకతోటి దయాసాగర్, పార్టీ మండల అధ్యక్షులు బి.వెంకటేశ్వర రెడ్డి, జడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి, పార్టీ నాయకులు తోకల నరసింహారావు, ధూళిపాళ్ల నాగేశ్వరరావు, ఉండవల్లి నరసింహారావు, షేక్ జానీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడుదాం

జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సీపీఐ గుంటూరు నగర సమితి సమావేశం స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో నగర కార్యవర్గ సభ్యురాలు జి.లక్ష్మి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజల విశ్వాసం పూర్తిగా కోల్పోయాయని అన్నారు. అధికారంలో రాక ముందు వారు ఇచ్చిన హామీలను పూర్తిగా తుంగలో తొక్కి ప్రజలను అనేక సమస్యల సాగరంలో ముంచివేశారని అన్నారు. నిత్యవసర సరుకు ధరలు పూర్తిగా సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు దాసోహమై పని చేస్తున్నాయని, ఆంధ్ర రాష్ట్రాన్ని అదానీ రాష్ట్రంగా మార్చే ప్రయత్నం జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్నాడని విమర్శించారు. ప్రకృతి వనాలను యావత్తు సహజ సంపదను అదానికి కట్టబెడుతున్నాడని, రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి తన కేసుల మాఫీ కోసం జగన్‌మోహన్ రెడ్డి నరేంద్ర మోదీకి శిరసా వహిస్తున్నాడన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా సీపీఐ పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధమవుతున్నదని అన్నారు. 2024 ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఇంటికి సాగనంపాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ నిర్వహించే పోరాటాలలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ గుంటూరులో జరిగే ప్రజా పోరాటాలలో పార్టీ సభ్యులు భాగస్వామ్యమై సీపీఐ నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. గత సమితి సమావేశం నుంచి ఈ సమావేశం వరకు నిర్వహించిన పార్టీ కార్యక్రమాలను ఆయన వివరించారు.

చరిత్రను విస్మరిస్తే జాతుల మనుగడ ప్రశ్నార్థకమే..

విశాలాంధ్ర-గుంటూరు : వర్తమాన భావితరాలకు తమ గత చరిత్రలను అధ్యయనం చేసే అవకాశం పాలకులు కల్పించకపోతే ఆ జాతుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ ఎలెక్ట్ ప్రెసిడెంట్ మాజేటి సోమశేఖర రావు అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట శ్రీ మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో గుంటూరు జిల్లా చరిత్ర సంఘం 29వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. చరిత్ర కాంగ్రెస్ పత్రా కాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో ముఖ్య వక్తగా పాల్గొన్న సోమశేఖర రావు మాట్లాడుతూ గత చరిత్రలోని దుర్మార్గాలను, మంచి చెడులను అధ్యయనం చేసుకుంటూ భవిష్యత్ తరాలకు నాగరిక జీవన విధానానికి తీసుకువెళ్ళేది చరిత్ర మాత్రమేనని అన్నారు. అధ్యక్షత వహించిన గుంటూరు జిల్లా చరిత్ర సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ ఎస్.శామ్యూల్ మాట్లాడుతూ ఇజ్రాయిల్, పాలస్తీనా వివాదం పరిష్కారానికి గతంలో ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని అంతర్జాతీయ సమాజం ఒత్తిడి తీసుకొచ్చి అమలు చేయడం ఒక్కటే మార్గమని తెలియజేశారు. అందుకు భారత దేశం చొరవ చూపాలని కోరారు. ఆచార్య బుద్ధిగా జమిందార్ వ్యాసాల సంకలనం పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం మంతెన వెంకటరాజు స్మారకోపన్యాసం, 'విద్యా వ్యవస్థలో చరిత్ర-మార్పులు, వ్యాఖ్యానాలు' అంశంపై చరిత్ర సమీక్షకులు కొప్పర్తి వెంకటరమణమూర్తి, 'భారత రాజ్యాంగం-లౌకికవాదం' అంశంపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.అంజిరెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వై.సుభాష్ చంద్రబోస్, సయ్యద్ అమీర్, డాక్టర్ మంచాల బోసుబాబు, డాక్టర్ పోతురాజు శ్రీనివాసరావు, సీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందమయ జీవనానికి కళలను ఆశ్రయించాలి: లక్ష్మీపార్వతి

విశాలాంధ్ర-తెనాలి : ఆనందమయంగా మనుగడ సాగాలంటే అనవసర విషయాల్లో జోక్యం చేసుకోకుండా ఉన్నదానితో సంతృప్తి చెంది కళలను ఆశ్రయించాలని తెలుగు, సంస్కృతం అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. సంగీత సాంస్కృతిక సంస్థ 'స్వరలయ వేదిక' రజతోత్సవం అలాగే 500వ కార్యక్రమ సభ తెనాలిలో శనివారం రాత్రి వైభవపేతంగా జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు లక్కరాజు సాయి నేతృత్వంలో ప్రముఖ నర్తకి, సినీనటి మంజుభార్గవిని జీవన సాఫల్య పురస్కారంతో.. అలాగే సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు, చింతలపాటి మంజుల (సంగీతం), ఎం.సత్యవర్ధన్(గానం)లను స్వరలయ ప్రతిభా పురస్కారాలతో వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులను ఆత్మీయ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. లక్ష్మీపార్వతి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ నాలుగు వేదాల్లోని సారాన్నంతా గ్రహించిన భరతముని పంచమ వేదంగా తీర్చిదిద్దిన నృత్యాన్ని పూర్తిగా సాకారం చేసుకున్న ప్రసిద్ధ నర్తకి మంజు భార్గవి అని ప్రస్తుతించారు. శంకరాభరణం సినిమాతో తెలుగు వారి హృదయాలలో గొప్ప స్థానాన్ని శాశ్వతంగా పొందగలిగారన్నారు. కళారాధనలోనే అద్వైతానందం ఉందన్నారు. మంజు భార్గవి స్పందిస్తూ అనుకున్నది ఏదైనా సాధించాలనే పట్టుదల కారణంగానే ఈ స్థాయికి చేరుకోగలిగానని అన్నారు. మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోగినేని ఉమా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ సభ రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, సినీ పరిశోధకులు సంజయ్ కిషోర్ తదితరులు తమ ప్రసంగాలతో లక్కరాజు సాయిని అభినందించారు. పాత్రికేయురాలు లలిత, తోటకూర వెంకట రమణారావు, పోతవఝుల పురుషోత్తమ శర్మ, పినపాటి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో గజల్, పద్యగావం, గాత్ర యువగళం, సినీ సంగీతం, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి.

సామాజిక విప్లవం తెచ్చిన సంస్కర్త జగన్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : బీసీల ఆత్మ బంధువు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని ప్రభుత్వ విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి కొనియాడారు. అన్ని రంగాల్లో బీసీలను ఉన్నత స్థాయికి తెచ్చేందుకు ఆయన కృషి చేస్తున్నారని తెలిపారు. బీసీలను ఆయా రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకునే రోజుల నుంచి బీసీలు రాజ్యాధికారం చేపట్టే రోజులకు చేరుకున్నారని స్పష్టం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన వడ్డెర కులానికి చెందిన ఓర్సు శ్రీనివాసరావు ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో లేళ్ళ అప్పిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. తన నియామకానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆలోచనా విధానానికి అనుగుణంగా పని చేయడమే కాక పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని ఓర్సు శ్రీనివాసరావు చెప్పారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే పరమావధిగా తమ వడ్డెర కులస్తులందరినీ ఏకతాటిపైకి తెస్తానని ఆయన ప్రకటించారు.

నిధులు దారిమళ్లిస్తున్న జగన్ ప్రభుత్వం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ నిధులను ఆయా వర్గాలకు కేటాయించకుండా జగన్ ప్రభుత్వం దారి మళ్లిస్తుందని అఖిల భారత దళిత, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంటా ప్రభుదాస్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం గుంటూరులోని రైల్వే ఎస్సీ, ఎస్టీ హాలులో అఖిల భారత దళిత, గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల నిధులను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల ప్రభుత్వమని చెప్పుకుంటూ వారిని మోసగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం పేద ప్రజల ఆగ్రహాన్ని చవిచూస్తారని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించి మభ్య పెడుతున్నారని, ప్రజాగ్రహానికి గురి కాకముందే సక్రమంగా అమలుకాని 28 సంక్షేమ పథకాలను తక్షణం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య, మంచాల జోసెఫ్, సుధాకర్, నల్లపు నీలాంబరం, తాటికొండ నరసింహారావు, జాన్‌బాబు, ఉగ్గం సాంబశివరావులు తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఎంతో ప్రయోజనకారి డాక్టర్ ముత్యం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఏసీ కళాశాల రిటైర్డ్ మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ పోలే ముత్యం ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధిగా నియమితులు కావడం చాలా సంతోషంగా ఉందని మాజీమంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయం నందు డొక్కా మాణిక్య వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ అధ్యాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి శాలువ బొకేలతో ఘనంగా అభినందించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ పోలే ముత్యం చాలా మందికి విద్యాబుద్ధలు నేర్పిన ఘనుడు అని కొనియాడారు. గుంటూరులోని ఏసీ కళాశాలను పున:రుజ్జీవనం చేయుటమే కాకుండా పల్నాడులో అనేక పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. మూతపడుతున్న పాఠశాలలను వెలుగులోకి తెచ్చిన వ్యక్తి అని, క్రైస్తవ సంఘాలకే కాకుండా సమాజానికి ఎంతో ప్రయోజనకారి అని గుర్తించి సీఎం జగన్ పదవి అప్పజెప్పినట్లు పేర్కొన్నారు. డాక్టర్ పోలే ముత్యం మాట్లాడుతూ తనను క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పదవి వచ్చేందుకు దోహదపడిన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డికి కూడా కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యం...

విశాలాంధ్ర-గుంటూరు : ప్రజల ఆరోగ్యమే లక్ష్యమని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. ఆదివారం బొంగరాలబీడు వెంకయ్య నగర్‌లో ప్రజల కోసం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 5 బృందంతో కూడిన వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ క్యాంపులో సుమారు 400 మంది పేద ప్రజలు ఈ వైద్య శిభిరంలో పాల్గొన్నారు. ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సామాన్యులకు కనీస వైద్య సదుపాయాలు అందడం లేదని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీని రూ.25 లక్షల వరకు పెంచామని జగన్ రెడ్డి చేస్తున్న ప్రచారం కేవలం ప్రచారానికే పరిమితమైందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య శాఖ ఉందా లేదా అనే పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఎప్పుడు ఎన్నికలు జరిగిన జగన్ రెడ్డికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని ప్రజలు బంగాళాఖాతంలో కలపడం ఖాయమని అన్నారు. ఇలాంటి మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అన్వేష్, డాక్టర్ గోపి, డాక్టర్ వెంకట్, డాక్టర్ వంశి, డాక్టర్ రాజశేఖర్, మద్దిరాల జోసఫ్ ఇమ్మానియేల్(మ్యాని), సొపాటి రత్నం, గంగులూరి నవీన్, మూడావత్ శ్రీనునాయక్, లింగంగుంట్ల ఆదాం, మహంకాళి నరసింహరావు, తాడివాక సుబ్బారావు, యర్రగోపు నాగేశ్వరరావు, వంగర ఏడుకొండలు, అడపా బాబు, కొండెపు శేఖర్, మహమ్మద్ నీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వాస ఘాతుకానికి నిదర్శనం జగన్ రెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు : మాయ మాటలతో, అబద్ధపు హామీలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల్ని నమ్మించి అధికారంలోకి వచ్చిన మరుక్షణమే తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన ముఖ్యమంత్రి జగన్ రెడ్డి రాష్ట్ర భవిష్యత్‌ను అంధకారంగా మార్చారని నగర జనసేన పార్టీ అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్ అన్నారు. విశ్వాసఘాతుకానికి నిలువెత్తు నిదర్శనంగా జగన్ రెడ్డి వినుతికెక్కాడని విమర్శించారు. రాజధాని ఉద్యమం నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కలక్టరేట్ ఆవరణలోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి రైతులకు అండగా ఉంటామంటూ టీడీపీ, జనసేన నేతలు ప్రకటించారు. ఈ సందర్భంగా నేరెళ్ల సురేష్ మాట్లాడుతూ రాజధాని అమరావతి చరిత్రలో 2019 డిసెంబర్ 17 చీకటి రోజన్నారు. ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో అమరావతిని రాజధానిగా ఒప్పుకొని అధికారంలోకి రాగానే అమరావతిపై విషం కక్కిన నమ్మకద్రోహి జగన్ అంటూ విరుచుకుపడ్డారు.ఆళ్ళ హరి, అన సూయ, బండారు రవీంద్ర, మెహబూబ్ బాషా, పులిగడ్డ గోపి, బందెల నవీన్, రాధాకృష్ణ, సయ్యద్ షర్ఫుద్దీన్, గడ్డం రోశయ్య, కొలసాని బాలకృష్ణ, దుర్గాప్రసాద్, కోలా అంజి, నైజామ్ బాబు, బియ్యం శ్రీను, జిలాని, కోలా మల్లి, సుందరరావు, అంజి, మిద్దె నాగరాజు, గుర్రాల ఉమ, నందూరి స్వామి, తాడికొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-తాడేపల్లి: కనీస వేతనం 26 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ మొదలైన సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న సమ్మె ఆదివారం 6వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా తాడేపల్లి తాసిల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు తుడిమెల్ల వెంకటయ్య, సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ అంగన్వాడిల సమస్యల పరిష్కరించకుండా ప్రభుత్వం కవ్వింపు చర్యలకు దిగటం చాలా దుర్మార్గమని అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే గుణపాఠం తప్పదన్నారు. అంగన్వాడీలు సరళ, తబితా, కిరణ్మయ్, మాణిక్యం, శ్రీదేవి, భవాని, సుజాత, లక్ష్మి, శోభా, వరలక్ష్మి, ఫాతిమా, మాధూరి పాల్గొన్నారు.

రామిశెట్టి శిల్ప సేవలు ప్రశంసనీయం: బాలస్వామి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: ఫిరంగిపురం గ్రామానికి చెందిన రామిశెట్టి జోజిప్ప, నిర్మాలా కుమార్తె రామి శెట్టి శిల్పా ఇక్కడి ప్రజలకు చేస్తున్న సేవలు ప్రశంసనీ యమని స్థానిక బాలయేసు కథెడ్రల్ దేవాలయ విచారణ గురువులు రెవ.డా.పామిశెట్టి బాలస్వామి కొని యాడారు. కొంత కాలంగా మండల కేంద్రమైన ఫిరం గిపురం గ్రామ పంచాయతీకి సంబంధించిన కోనేరు చెరువు నుంచి నిత్యం గ్రామ ప్రజలకు తాగు నీరు సరఫరా చేసేందుకు అనగా రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్ యూనిట్లు బెడ్‌లకు మరమ్మతులు నిమిత్తం విరా ళాలు అందించిన దాతలకు ఆదివారం అభినందన సభా జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఫాదర్ బాలస్వామి మరమ్మతులు ప్రారంభానికి ప్రత్యేక ప్రార్ధనలు చేసి ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు పెరికల జేమ్స్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన శిల్ప జర్మనీలో ఓ ఉద్యోగంలో స్థిరపడి గ్రామ ప్రజలపై తనకున్న మమకారాన్ని చూపించి తన సహకారంతో రోటరీ క్లబ్ రియాల్టింజెన్-టూబింగిజెన్ ఐ టి డిజైన్ కంపెనీ ప్రెసిడెంట్ థామస్ ముల్లర్, మేనేజింగ్ డైరెక్టర్‌లు డా.జార్గ్‌లూట్, జానేస్ కొప్పెన్ హోపర్‌లు ద్వారా ఫిరంగిపురం రక్షిత మంచినీటి పథకానికి రు.15లక్షల రూపాయలు సహాయం అందింప జేశారని ఫిరంగిపురంలో 20వేలమంది ప్రజ లకు స్వచ్ఛమైన తాగు నీరందించేందుకు సహకరించిన శిల్ప సేవలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి షేక్.షహెలా నర్గీస్ సలీమ్, జడ్పిటిసి దాసరి కత్తిరేణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు మార్పుల శివరా మిరెడ్డి, వైస్ ఎంపిపి గుమ్మడి చంద్రం, సర్పంచ్ మేడా బాబు, ఉప సర్పంచ్ ఎండ్రెడ్డి రమాదేవి, ఎంపిటిసి లక్ష్మయ్య, కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, చిట్టా బాపూజీరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, ఎండ్రెడ్డి యల్లా రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

అమరయ్య ట్రస్ట్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-మంగళగిరి: వీవర్స్ కాలనీ ఎంటీఎంసీ హైస్కూల్లో స్థానిక చిల్లపల్లి అమరయ్య సేవా ట్రస్ట్ సహకారంతో విజయవాడ టాప్ స్టార్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత పూర్తిస్థాయి గుండె జబ్బుల వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్ఆర్సీపీ నియోజకవర్గ ఇన్చార్జి గంజి చిరంజీవి హాజరయ్యారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ మురుగుడు ప్రారంభించారు. శిబిరంలో ఎత్తు, బరువు, పల్స్, టెంపరేచర్, బిపి, షుగర్, ఈసీజీ, ఏకో తోపాటు గుండెకు సంబంధించిన అన్ని పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సంజయ్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ట్రస్ట్ చైర్మన్ చిల్లపల్లి నాగ తిరుమలరావు అధ్యక్షత వహించారు. సభను ఉద్దేశించి ఎమ్మెల్సీ మురుగుడు మాట్లాడుతూ ట్రస్ట్ చైర్మన్ నాగ తిరుమలరావు పేదల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, విజయవాడ దుర్గ గుడి ప్రత్యేక ఆహ్వాన కమిటీ సభ్యులు జక్కిరెడ్డి ప్రభాకరరెడ్డి, వివిధ రంగాల ప్రముఖులు స్వర్గం పుల్లారావు, జొన్నాదుల శివప్రసాద్, హైస్కూల్ హెచ్ఎం గోలి నాగేశ్వరరావు, ట్రస్ట్ ప్రతినిధులు బోడా సామ్రాజ్యం, జొన్నాదుల సత్యవతి, నగేష్, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం గురువుకు సన్మానం

విశాలాంధ్ర-తెనాలి : పట్టణంలోని అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలు నేర్చుకున్న 54 మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చి తిరుమల నాదనీరాజనంలో సంకీర్తన గానం చేయించి మరల తెనాలికి తీసుకుని వచ్చిన గురువులు కొండపి వసుంధర శ్రీనివాసరావు దంపతులను సంకీర్తన బృందం నాజర్‌పేటలోని కొల్లూరు వారివీధిలో గల శ్రీ సీతారామాంజనేయ దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం పౌరసన్మానం చేశారు. సంగీతం ఆత్మ సాక్షాత్కారానికి దారితీస్తుందని, మనలో ఉన్న భక్తిని భగవంతుని తత్వానికి చేరువకావడానికి ఆధారభూతమవుతుందని తెలిపారు. పశుపక్షాదుల నుంచి కూడా సంగీతానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని, ఈ సంకీర్తన ద్వారా మనిషిలో ఉన్నటువంటి ఏకాగ్రతను భగవంతునివైపు మరల్చడానికి దారితీస్తుందని బృందం సభ్యులు అందె బాలచంద్రమౌళి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదాల రూపశ్రీ, అందె తన్మయి, దేవీ లలిత, తులసి, లక్కరాజు కనకదుర్గ, అందె రాజేశ్వరి, రామలక్ష్మి, వినతి, అనిత, కటకం అన్నపూర్ణ, ఆకురాతి మౌనిక, సురాబత్తుల కేశవరావు తదితరులు పాల్గొన్నారు. శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో కేవలం ప్రచారం నిమిత్తం మాత్రమే ఉచితంగా శిక్షణనిస్తున్నట్లు సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలిపారు.

నౌషద్‌కు న్యాయం జరిగే వరకు టీడీపీ పోరాటం

విశాలాంధ్ర-గుంటూరు : నౌషద్‌కు న్యాయం జరిగే వరకు టీడీపీ పోరాడుతుందని, అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని టీడీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోహమ్మద్ నసీర్, రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ అన్నారు. గుంటూరు లాలాపేటకి చెందిన నౌషద్‌ని వారి కుటుంబాన్ని నమ్మించి బాపట్ల ఎంపీ నందిగాం సురేష్ అనుచరుడు సన్నీ ఇసుక రీచ్ ఇప్పిస్తాని రూ.25 లక్షల డబ్బును తీసుకొని మోసం చేయడంతో ఆత్మహత్యకు పాల్పడిని నౌషద్ గత మూడు రోజులుగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం మోహమ్మద్ నసీర్, మౌలానా ముస్తాక్ అహ్మద్, మైనారిటీ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ నౌషద్ ఆత్మహత్యకు పాల్పడి మూడు రోజులు అవుతున్న నేటికి వైసీపీ నాయకులు గానీ అధికారులు గానీ పోలీసులు గానీ దృష్టి సారించకపోవడం సిగ్గుచేటని అన్నారు. మౌలానా ముస్తక్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనారిటీలపై దాడులు పెరిగాయని అన్నారు. వక్ఫ్ బోర్డు భూములను దోచుకుంటున్నారని ప్రశ్నించే మైనార్టీల గొంతు నొక్కే కార్యక్రమం చేయబడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ గని, లాల్ వజీర్, హఫీజ్, అబ్జల్, జమీర్, సలీం, ఫరూక్, ఖాసీం వలి, ఉస్మాన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

సిటిజెన్ క్లబ్ ఛైర్మన్‌గా గూడవల్లి గంగాధర్

విశాలాంధ్ర-పొన్నూరు: నూతనంగా ప్రారంభించిన సిటిజెన్ క్లబ్‌కి ఛైర్మెన్‌గా గూడవల్లి గంగాధర్, వైస్ ఛైర్మన్ గా షేక్ మస్తాన్ (కరాటే మాస్టర్) ను ఎన్నుకున్నట్లు డిస్ట్రిక్ట్ లయన్స్ క్లబ్ కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిటిజన్ క్లబ్ ఛైర్మన్ గంగాధర్ మాట్లాడుతూ తనను ఎన్నుకున్న సభ్యులకు, పెద్దలకు ఇందుకు సహకరించిన మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

Protium ప్రొటియం ఫైనాన్స్ లిమిటెడ్

(పూర్వం గ్రోత్ సోర్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీస్ లిమిటెడ్‌గా తెలిసినది) నిర్లాన్ నాలెడ్జ్ పార్క్ (ఎన్‌కెపి) బి-2, ఏడవ అంతస్తు, పహాడి గ్రామం, ది వెస్టన్ ఎక్స్‌ప్రెస్ హైవే మీదుగా, రమా ఇండస్ట్రియల్ ఎస్టేట్, గొరెగావ్ (ఇ), ముంబై, మహారాష్ట్ర-400063

స్వాధీనత ప్రకటన

(స్థిరాస్తి కొరకు)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(1)తో చదివే అనుబంధం-4 ప్రకారం) ప్రొటియం ఫైనాన్స్ లిమిటెడ్ (పూర్వం గ్రోత్ సోర్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీస్ లిమిటెడ్) (ఇక మీదట "ప్రొటియం ఫైనాన్స్ లిమిటెడ్" గా చదువుకొనవలెను) అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) (సర్ఫేసి చట్టం) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002, నిబంధన 3తో చదివే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి రుణగ్రహీతలు శరవన్ అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు సహ-రుణగ్రహీతలు 1. పట్టికూటి సైదారావు 2. సందీప పట్టికూటి 3. శరవన్ ప్రైసెస్ లకు లోన్ ఎకౌంట్ నెం. GS032LAP736127 కు సంబంధించి నోటీసులో ప్రస్తావించబడినట్లుగా సెప్టెంబరు 08, 2023 నాటికి రూ.2,09,75,075.74/- (రెండు కోట్ల తొమ్మిది లక్షల డెబ్బైఐదు వేల డెబ్బై ఐదు రూపాయల డెబ్బై నాలుగు పైసలు మాత్రమే) లను నోటీసు అందిన 60 రోజుల్లోగా తిరిగి చెల్లించ వలసిందిగా పిలుపునిస్తూ సెప్టెంబరు 12, 2023 న డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

రుణగ్రహీతలు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున నిబంధనల్లో పేర్కొన్న నిబంధన 9తో చదివే చట్టం యొక్క సెక్షన్ 13(4) కింద అతను/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు డిసెంబరు 13, 2023 న స్వాధీనం చేసుకున్నట్లు రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదని, ఈ ఆస్తితో ఏదేని లావాదేవీలు సెప్టెంబరు 08, 2023 నాటికి రూ.2,09,75,075.74/- (రెండు కోట్ల తొమ్మిది లక్షల డెబ్బైఐదు వేల డెబ్బై ఐదు రూపాయల డెబ్బై నాలుగు పైసలు మాత్రమే) మరియు దీనిపై భవిష్యత్తు వడ్డీ ప్లస్ వ్యయాలు, చార్జీలు వెచ్చించిన ఖర్చులకు గాను ప్రొటియం ఫైనాన్స్ లిమిటెడ్ చార్జికి లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీత(లు)ను, మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

స్థిర ఆస్తి వివరాలు : గుంటూరు జిల్లా, పెదకూరపాడు ఎస్.ఆర్.ఓ. పరిధి, పెదకూరపాడు మండలం, పెదకూరపాడు గ్రామం మరియు గ్రామ పంచాయతీ లో తేదీ: 20/04/2018 నాటి అప్లికేషన్ నం. NLCR11800014769 ద్వారా వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతర భూమిగా మార్పు చేసినది. రెవిన్యూ భూమి రికార్డుల ప్రకారం ఆర్.ఎస్. నం.557.బి, అటు పిమ్మట సర్వే నం.557/బి1, ప్రస్తుత సర్వే నం.557/బి1/ఎ, పాత పట్టానం.4947లో మార్పుచేసిన ఎసి 0.40 సెంట్లు లేదా 1936 చదరపు గజాల ఖాళీ భూమి మొత్తంగా. హద్దులు: తూర్పు: ఆర్&బి రోడ్డు, దక్షిణం: సర్కార్ కండవా డొంక రోడ్డు, పడమర: జవ్వాజి శ్రీహరిరావు భూమి, ఉత్తరం: పా రమేశ్‌కుమార్ జైన్‌కు చెందిన భూమి.

ప్రదేశం: గుంటూరు, తేదీ:13-12-2023 సం/- అధీకృత అధికారి, ప్రొటియం ఫైనాన్స్ లిమిటెడ్

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-దుర్గి: మండల కేంద్రమైన దుర్గి జెయంజె వృద్ధులకు దుప్పట్లు పంపిణీ, అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని మదర్ థెరిస్సా సేవాసమితి మాచర్ల వారి సారధ్యంలో ప్రెసిడెంట్ కసిరెడ్డి శాంతి రెడ్డి అధ్యక్షతన ఆదివారం జెయంజె వృద్ధాశ్రమంలో నిర్వహించారు. దుగ్గెంపూడి రాయ శౌరెడ్డి, అగతమ్మల కుమారుడు క్రాంతి సుధాకర్ రెడ్డి 40వ జన్మదిన శుభసందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జక్కిరెడ్డి మర్రెడ్డి, తుమ్మా మర్రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, పాపిరెడ్డి. చిన్న పు రెడ్డి. అంతోనమ్మ, నిర్మలా జ్యోతి, చిన్న శౌర్యులు, క్రాంతి శృతిక, సిస్టర్లు సూఫీరియార్, వీటీషియ, సీమ, మేరీ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

విశాలాంధ్ర-దుర్గి: ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షే ం పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండా లని బిజెపి మండల అధ్య క్షులు వెలిదండి శ్రీనివాస రావు అన్నారు. ఇన్చార్జీ ఎంపిడిఓ జీఎల్ఎన్ గుప్తా ఆధ్వర్యంలో మండల పరిధిలోని పోలేపల్లి, తేరాల గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన 17 రకాల సంక్షేమాభివృద్ధి పథకాలపై ప్రచార యాత్ర ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ నాగ బ్రహ్మయ్య, డా.శివ రామకృష్ణ, అంగన్వాడీ సూపర్ వైజర్ నాగేంద్రమ్మ, బిజెపి నాయకులు గుమ్మడి నాసరయ్య, శెట్టి హనుమంతరావు, సెక్రటరీ అంబారావు, సచివాలయ, ఉపాధి, ఆరోగ్య, అంగన్వాడీ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య వృత్తిలో హాస్పిటల్ సిబ్బంది పాత్ర కీలకం

విశాలాంధ్ర-సత్తెనపల్లి: వైద్య వృత్తిలో హాస్పిటల్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమైనది ఐయంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్ అన్నారు. ఆదివారం స్థానిక వేద కళాశాలలో సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలల కంపౌండర్ నర్సుల నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించారు .సభకు గీతా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ గీతా హసంతి అధ్యక్షత వహించారు. శ్రీధర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ వైద్యశాలలో నర్సు కంపౌండర్‌లు చాలా కీలకమన్నారు. ప్రస్తుత పరిస్తితులలో ప్రతిఒక్కరూ తమ వృత్తిపట్ల అంకిత భావంతో పనిచేయాలన్నారు. హాస్పిటల్స్‌లో పనిచేసే సిబ్బందికి ప్రతిఒక్కరూ ఈఎస్ఐ కట్టటం ద్వారా రిటైర్‌మెంట్ తరువాత వెసులుబాటు కలుగుతుందన్నారు. వంశీ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ షకీలా శ్రీధర్ మాట్లాడుతూ వైద్యసిబ్బంది, డాక్టర్లు అవినాభావ సంబంధం కలిగివుండాలి అన్నారు. రోగుల పట్ల ప్రేమతో ఉండటం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం గౌరవ అధ్యక్షులు యం హనుమంతరావు, అధ్యక్షులు ఎస్‌యం రఫీ, కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ షేక్ వలి , సహాయ కార్యదర్శి ఎస్ ప్రసన్న కుమార్, కోశాధికారి టి యేసు రంజిత్ కుమార్, యం లక్ష్మీ, లక్ష్మి నాగ మల్లేశ్వరి, కే పుల్లారావు, జి.పిచిరెడ్డి, చిన్న నాయక్‌లు ఎన్నికయ్యారు.

6వ రోజుకు అంగన్వాడీల సమ్మె

విశాలాంధ్ర -వినుకొండ: అంగన్వాడీల సమ్మె ఆరవ రోజుకు చేరుకున్నాయి ఆదివారం సురేష్ మహల్ రోడ్డు నందు సమ్మె నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ట్రెజరర్ లక్ష్మీ ప్రసన్న అధ్యక్షతన జరిగింది ప్రీ స్కూల్ పిల్లలు తల్లులు గర్భవతులు మరియు బాలింతలు కార్యక్రమాన్ని నిర్వహించారు వినూత్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. లబ్ధిదారులు ఈ గాయత్రి కమల బిబి మొదలైన వారు మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలు చాలా బాగా సెంటర్స్ నడుపుతూ మా పిల్లల్ని బాగా చూసుకుంటున్నారు అన్నారు ఇంట్లో ఒక్క పిల్లను భరించటమే కష్టం అలాంటి ఈ రోజుల్లో అంగన్వాడీ కేంద్రాల నందు టీచర్లు ఆయాలు చిన్నపిల్లలను 20 నుండి 25 మందిని ఒక దెబ్బ కూడా వేయకుండా చూసుకుంటారని మంచి భోజనం పెడతారు అంతటి వాళ్లు న్యాయమైన కోరికలు ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం లో సిఐటియు జిల్లా అధ్యక్షులు హనుమంత రెడ్డి పట్టణ సిఐటియు కార్యదర్శి ఆంజనేయులు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు కొండయ్య మాస్టర్ హాజరై మద్దతు తెలియజేశారు. నాయకులు సిఐటియు నుండి ఏ. లక్ష్మీప్రసన్న, జి. నాగజ్యోతి, డి. బీబులు, శ్రీదేవి జి .పద్మ, గాయత్రి, నిర్మల, హాజరయ్యారు ఏఐటియుసి నుండి సారమ్మ మున్ని, ఉమాశంకరి, రేవతి, హరతి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద జాతీయ క్రీడాకారుడిని ఆదుకుందాం



విశాలాంధ్ర-వినుకొండ: పట్టణానికి చెందిన జాతీయ క్రీడాకారుడు షేక్ అబ్దుల్లా గత 10 సంవత్సరాలుగా భారతదేశంలో పరుగు పందెం పోటీలు ఎక్కడ జరిగినా ఆయా పోటీలలో పాల్గొనడం గోల్డ్, సిల్వర్ ,మెడల్స్ తో పాటు మరెన్నో బహుమతులు, సర్టిఫికెట్లు సాధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా వినుకొండ ఖ్యాతిని దశ దిశల ప్రతి ఒక్కరికి తెలియజేసిన క్రీడాకా రుడు. 2024లో ప్యారిస్ ఒలంపిక్స్ లో ఆడాలన్నదే అబ్దుల్లా ఏకైక లక్ష్యం ! నిరుపేద కుటుంబానికి చెందిన అబ్దుల్లాకు సరైన పోషకాహారం లేక రన్నింగ్ శిక్షణకు సంబంధించిన సరైన కిట్లు కూడా లేనం దున పై స్థాయికి వెళ్లలేకపోతున్నాడు. ఇప్పటిదాకా అనేక రాష్ట్రస్థాయి,జాతీయస్థాయి, మరియు ఓపెన్ ఏషియన్ లో అర్హత సాధించి అనేక పోటీలలో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించడం జరిగింది. అంతర్జాతీయ స్థాయిలో జరిగే ఒలంపిక్ పోటీలలో ఆడేందుకు కావలసిన శిక్షణ నిమిత్తం హిమాచల్ ప్రదేశ్ లోని సిమ్లా లో ఉన్నటువంటి కోచింగ్ సెంటర్ కు వెళ్లేందుకు ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేనందున దాతలను ఆశ్రయిస్తున్నాడు. అదేవిధంగా ప్రభుత్వం నుండి కూడా ఎటువంటి సహాయ సహకారాలు, ప్రోత్సాహకాలు లేనందున దయగల దాతలు ఎవరైనా ఉంటే ఆర్థిక సహాయం చేయవలసిందిగా కోరుకుంటున్నాడు. షేక్ అబ్దుల్లా , గూగుల్ పే ,ఫోన్ పే నెంబర్:9515481545.

ఏసుక్రీస్తు సద్గుణాలు సమాజానికి అవసరం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైఎస్సార్‌సీపీ అధ్యాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. గుంటూరు రెడ్డి కళాశాల సమీపంలో ఉన్న కామాక్షి అపార్ట్‌మెంట్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం 'సెమీ క్రిస్మస్'వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వైఎస్సార్‌సీపీ అధ్యాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభువైన ఏసుక్రీస్తు ప్రవచించిన ప్రేమ, కరుణ, త్యాగం వంటి సద్గుణాలు సమాజానికి అవసరమని పేర్కొన్నారు. అపార్ట్‌మెంట్ సంఘ అధ్యక్షులు సైదారెడ్డి వందన సమర్పణ చేశారు. ఈ వేడుకలకు స్థానిక కార్పొరేటర్ షేక్.రోషన్, ఆదరణ కర్త మినిస్ట్రీస్, రిబ్కా ప్రతినిధులు బ్రదర్ జోసఫ్, ఆదిత్య హాస్పిటల్ అధినేత తదితరులు పాల్గొన్నారు.

మోదీ భజన మానుకోవాలి: జంగాల

విశాలాంధ్ర-మంగళగిరి: రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిస్తూ, కేంద్ర ప్రభుత్వం అబలంబిస్తున్న ద్వంద్వవైఖరి నాటకాలను కట్టిపెట్టాలని, అధికారం ఉంది కదా అని ఏది చేస్తే అది చెల్లుతుంది అనుకుంటే కాలగర్భంలో కలిసి పోవాల్సిందేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ హెచ్చరించారు. నగరంలోని సీపీఐ కార్యాలయం వేములపల్లి శ్రీకృష్ణ భవన్లో నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం జాలాది జాన్ బాబు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా హాజరైన జంగాల, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ నరేంద్ర మోదీకి జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ భజన చేయటం మానుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నో హామీలు గుప్పిస్తూ అధికారంలోకి వచ్చినాక హామీలు నెరవేర్చకుండా, శాంతియుతంగా దీక్షలు, ధర్నాలు, చేస్తుంటే రాక్షసత్వంగా ఈ రాష్ట్ర ప్రభు త్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అంగన్వాడీలు వారి సమస్యలను పరిష్కరిస్తానని ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి నేడు అదే అంగన్వాడీల సమస్యలు పరిష్కరించలేదని, నిరవధిక సమ్మెలు చేస్తుంటే సచివాలయ, వాలంటరీ, వీఆర్వోలతో సిబ్బందులతో అంగన్వాడి కేంద్రాల తాళాలను పగలగొట్టిస్తూ రాక్షస ఆనందం పొందుతున్నారని అన్నారు. కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ఎలా ఆడమంటే అలా ఆడుతూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. రాజధాని లేని రాష్ట్రంగా చేసి మూడు రాజధానుల పేరుతో రాజధానికి స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే పట్టి పట్టనట్టు వ్యవహరిస్తూ చోద్యం చూస్తున్నారని జంగాల మండిపడ్డారు. రైతులను పట్టించుకోకుండా ప్రతి సందర్భంలోనూ ఇది రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న జగన్మోహన్ రెడ్డి తుఫాను హెచ్చరికలు చేస్తున్నప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా రైతులు పంట నష్టపోయి ఆవేదన చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యలు చేసుకుంటుంటే కనీసం వారిని పట్టించుకునే నాధుడే లేక విలవిలలాడుతున్న వారి కుటుంబాలు వ్యవసాయం చేసుకోలేక అప్పుల పాలై వారు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై ప్రైవేట్ కార్పొరేట్ వ్యక్తులకు దాసోహమై పని చేస్తున్నాయని. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతున్నదని అన్నారు. 2024 ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఇంటికి సాగనంపాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ నిర్వహించే పోరాటాలలో పార్టీ కార్యకర్తలు, ప్రజ లు పోరాటానికి సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. డిసెంబర్ 26వ తేదీన పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ప్రతి గ్రామ స్థాయి నుంచి కమిటీలు వేసి నిర్వహించాలని తెలిపారు. సోమవారం 18వ తారీఖు అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలలో అర్జీల ఇచ్చే కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వర్రావు, పట్టణ సహాయ కార్యదర్శి నందం నందం బ్రహ్మేశ్వరరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గండికోట దుర్గా రావు, తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, షేక్ మదీనా బాబు, గుంటక సాంబిరెడ్డి, మానికొండ డాంగే, మునగాల రామారావు, గుడిమెట్ల శివకుమారి, యార్లగడ్డ శివయ్య, ఉడతా శ్రీనివాసరావు, ఉయ్యాల సత్యనారాయణ, ఎస్కే కరీముల్లా, కాకర్ల నర సింహారావు, బుర్ల శ్రీనివాసరావు, నూతక్కి శ్రీనివాసరావు, పంతగాని మరియదాసు, గోహర జానీ, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కో కన్వీనర్ మత్తే అభిషేక్, పట్టణ అధ్యక్షుడు హనోక బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా పెన్షనర్ల దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-వినుకొండ: ఆల్ ఇండియా పెన్షనర్ల దినోత్సవం, 16వ వార్షిక సమావేశాన్ని ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పెన్షనర్ల పితామహుడు డి.ఎస్. నకరా చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. సంఘ సహాధ్యక్షులు భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పెన్షన్ ఒక హక్కు అని, బహుమతిగా ఇచ్చేది కాదని, ప్రభుత్వ ఉద్యోగిగా సుదీర్ఘ కాలం సేవలందించినందుకు గౌరవప్రదంగా ఇచ్చేదని తీర్పు వెలువరించినందుకు దేశంలో లక్షలాదిమంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రశాంతంగా జీవిస్తున్నారని తెలియజేశారు. ప్రధాన కార్యదర్శి కె కృష్ణమూర్తి 2023 వ సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక నివేదికను సభలో ప్రవేశపెట్టి సభ ఆమోదం పొంది సంఘంలో జరుగుతున్న కార్యక్రమాలు అన్నియు సభ్యులకు వివరంగా అందజేశారు. అతిథులుగా పాల్గొన్న ఎస్బిఐ మేనేజర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పెన్షనర్లందరికీ సులభతరంగా లోన్లు మంజూరు చేస్తామని, సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పల్నాడు జిల్లా పెన్షనర్ల సంఘ ఉపాధ్యక్షులు జే.ఐ.వి కృపాకర్ రావు మాట్లాడుతూ పెన్షనర్ల సమ స్యలు జిల్లా పరిధిలో ఏమైనా పెండింగ్‌లో ఉంటే వాటిని వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్ దంపతులైన షేక్. అల్లా బక్షుతో పాటు మరి కొంతమందిని శాలువా, పూలమాలతో సన్మానించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు గాదె కృష్ణారెడ్డి, కోశాధికారి కెవి. రాఘవయ్య, ఎం.వి సుబ్బయ్య శర్మ ,ఎంవి శర్మ, గురవయ్య, సుబ్బారావు, చిన్న కోటయ్య, దుబ్బల దాసు ,శామ్యూల్, నాగేంద్రుడు, సైదావలి, వెంకటస్వామి, రమేష్ ,శేషయ్య, పెన్షనర్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గణిత ప్రతిభా పరీక్ష పోటీలకు విశేష స్పందన

విశాలాంధ్ర-శావల్యాపురం: విద్యార్థులకు గణితంతోనే మంచి భవిష్యత్ ఉంటుందని శ్రీరామ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కె.వి.ఆర్ మోహన్ చంద్ అన్నారు. ఈనెల 22వ తేదీన శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరామ పబ్లిక్ స్కూల్ నందు మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష పోటీలు నిర్వహించారు. ఈ పరీక్షలకు విద్యార్థుల నుండి మంచి స్పందన లభించిందని, మండల వ్యాప్తంగా 420 మంది విద్యార్థులు పోటీ పరిక్షలలో పాల్గొన్నారని యాజమాన్యం తెలిపారు. ఫలితాలను ఈనెల 21న ప్రకటించి, 22వ తేదీ రామానుజన్ జన్మదినం సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరాజు, గురుబాబు, కనక రత్నం, పాఠశాల డైరెక్టర్ అజిత్ చంద్, రత్నకుమారి, పారా శివ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా నిలవాలి

విశాలాంధ్ర, తెనాలి : సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న ప్రతి ఒక్కరూ పేద విద్యార్థులకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ప్రముఖ తులసీ సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు అన్నారు. కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ వారి 19వ మెరిట్ స్కాలర్షిప్పుల పంపిణీ కార్యక్రమం స్థానిక టీజీకె కళ్యాణమండపంలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథి తులసీరామచంద్ర ప్రభు మాట్లాడుతూ సమాజాన్ని అభివృద్ధి పరచాల్సిన బాధ్యత యువత భుజస్కంధాలపై ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతోనే దేశఅభివృద్ధి ఆధారపడిందని పేర్కొన్నారు. విశ్రాంత జీఎస్టీ కమీషనర్, ఐ.ఆర్.యస్. అధికారి రంగిశెట్టి మంగబాబు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. కెపా అసోసియేషన్ ద్వార గత 19 సంవత్సరాలుగా పేద మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నారని ఇదంతా సహృదయంతో ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్న దాతల వల్లే సాధ్యమని పేర్కొన్నారు. ప్రియదర్శిని విద్యాసంస్థల అధినేత చందు రామారావు మాట్లాడుతూ పేదరికంతో చదువుకోలేని విద్యార్థుల ఆవేదన తనకు తెలుసునన్నారు. విద్యార్థులు జీవితంలో ఎదిగి సమాజం పట్ల తమవంతు బాధ్యతగా సేవ చెయ్యాలన్నారు. చదువుకోవాలనే జిజ్ఞాస ఉన్న వారికి పేదరికం అడ్డుకారాదనే సదుద్దేశ్యంతో కెపా ద్వారా ఉపకార వేతనాలు అందించి వారికి అండగా నిలవడం ఆదర్శనీయమన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అరవ రామకృష్ణ, కెపా అధ్యక్షులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బొల్లిముంత వెంకట నారాయణలు మాట్లాడుతూ 2002లో 20వేల రూపాయలతో ప్రారంభించి ఈ సంవత్సరం ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, పీజీ చదువుతున్న 358 మంది మెరిట్ విద్యార్థులకు రూ.11,18,680/-లు ఉపకార వేతనం అందించామని తెలిపారు. దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. కెపా సెక్రటరీ తాడికొండ చిన్నబ్బాయి వార్షిక నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో అమెరికా ప్రొగ్రెస్సివ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చందు శ్రీనివాసరావు, విశ్రాంత కస్టమ్స్ అసిస్టెంట్ కమీషనర్ బళ్ళ నరేంద్ర కుమార్, తెనాలి మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు, ఆంధ్రప్రదేశ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బడే ప్రభాకర్, నారాయణ విద్యాసంస్థల ఏజీఎం కె.వెంకటేశ్వరారవు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర-చిలకలూరిపేట: రాష్ట్రోపాధ్యాయ సంఘం చిలకలూరిపేట పట్టణ శాఖ సమావేశం ఆదివారం స్థానిక సంఘ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య నాయకులు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కే కోటేశ్వర రావు, రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖలో జీవో నంబర్ 117 రద్దు చేయాలని లేనిచో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుందన్నారు. విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు తరలి వెళుతున్నారని అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పిఆర్సి బకాయిలు, డిఏ బకాయిలు, పియఫ్, ఏపీజీఎల్ఐ లోన్, మొత్తాలు తుది చెల్లింపులు, సరెండర్ లీవ్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్టియు డిమాండ్ చేస్తున్నదని అన్నారు. మున్సిపల్ పాఠశాలలో పదోన్నతులను వెంటనే పూర్తి చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్‌ను వెంటనే ప్రారంభించాలని, విద్యా వ్యవస్థలో యాప్‌ల భారాన్ని తగ్గించాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, సీనియర్ నాయకులు చావలి మల్లేశ్వర రావు, పట్టణ అధ్యక్షుడు మేకల కోటేశ్వరరావు, కార్యదర్శి షేక్ జమీర్, బాషా హనుమంతు నాయక్, జే కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక మానసిక ఆరోగ్యం

విశాలాంధ్ర-ఈపూరు: విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా క్రీడలలో పాల్గొనడం ద్వారా శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడి చదువులోనూ రాణిస్తారని ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చుండు వెంకటరావు అన్నారు. మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాలలో ఎంపీఈడి ద్వితీయ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న పి నాగ వెంకటేశ్వర్లు ఈనెల 15వ తేదీన నాగార్జున విశ్వవిద్యాలయం నందు జరిగిన తొంబై కేజీల విభాగంలో జుడోకు ఎంపికయ్యారని , నాగార్జున విశ్వవిద్యాలయ జట్టు తరపున తమ కళాశాల విద్యార్థి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చుండు వెంకటరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో విద్యార్థులు సెల్ ఫోన్లు కంప్యూటర్లు వంటి వాటికీ అలవాటు పడి ఎలాంటి శారీరక వ్యాయామం లేకపోవడం వల్ల పలు ఆరోగ్యసమస్యలతో ఇబ్బందులకు గురవటం జరుగుతుందన్నారు. ఏ దేశ ప్రగతి అయినా తరగతి గదులలోనే తయారవుతుందని క్రీడలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు క్రమశిక్షణ గల పౌరులుగా ఎదుగుతారని, విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ అంకిత భావం పెరిగి చెడు అలవాట్లకు దూరంగా ఉత్తమ పౌరులుగా సమాజంలో గుర్తింపు పొందడం జరుగుతుందన్నారు. అనంతరం తమ కళాశాల విద్యార్థి నాగ వెంకటేశ్వర్లను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మెదరమెట్ల రామ శేషగిరిరావు, అధ్యాపకులు ఆర్ బలరాం నాయక్, సిహెచ్ అరవింద్ దాసు తదితరులు అభినందించారు.

పవర్ ఫౌండేషన్ సేవలు ఎనలేనివి

విశాలాంధ్ర-మాచర్ల: పట్టణంలో పవర్ ఫౌండేషన్ అధ్యక్షులు, న్యాయవాది జి జయానంద రావు సేవలు ఎనలేనివని ఎస్సిజెపిపిఎస్ జాతీయ అధ్యక్షులు గురజాల అప్పారావు అన్నారు. ఆదివారం జయానందరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుప్పట్లను యాచకులు, వికలాంగులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ పవర్ ఫౌండేషన్ ఏర్పాటుచేసిన కొద్దికాలంలోనే జయానందరావు ఎన్నో సేవా కార్యక్రమాలను చేయడం సంతోషకరమన్నారు. అనంతరం ఫౌండేషన్ నిర్వాహకులు లాయర్ జయానందరావు మాట్లాడుతూ సమాజంలోని పేదలను గుర్తించి వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. ఇప్పటివరకు తనకు మెసులుబాటుగా ఉన్న ధనంతో పేదలకు సేవ చేస్తూ వచ్చానని, భవిష్యత్తులో ఎవరైనా దాతలు ముందుకు వస్తే వారి సహకారంతో తమ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. సుమారు రూ.10 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన దుప్పట్లను పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వై సాంబశివరావు, ఆర్ రంగానాయక్, పోతురాజు పేరం రత్నారావు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కమిటీ నియామకం

విశాలాంధ్ర-తాడేపల్లి: జనసేన మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామ కమిటీ సభ్యులకు నియమక పత్రాలు మంగళగిరి ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు చేతుల మీదుగా అందించారు. గుండిమెడ గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులుగా జెట్టి రమేష్ బాబు, ఉపాధ్యక్షులుగా మేకల కృష్ణ ప్రధాన కార్యదర్శులు కనపర్తి రవిబాబు, బుజ్జా శంకర్, షేక్ నాగుల్ మీరా, నామతోటి వంశీ కార్యదర్శులుగా నామతోటి నరేష్, దాసరి ఏసుదాసు,సంయుక్త కార్యదర్శులుగా పల్లె శంకర్ బాబు, ఆరుమళ్ళ కార్తీక్, మేడికొండ ఆనంద్, మొరుగుమాల గణేష్, బద్దెపూడి శంకర్ గ్రామ సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ కొచ్చర్ల నాగమల్లేశ్వరరావు, ఆరుమళ్ళ వంశీ ని నియమించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బేతపూడి విజయ శేఖర్, గుంటూరు జిల్లా కార్యదర్శి రావి రమా,ఎంటీఎంసీ అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావు, ఎంటీఎంసీ ఉపాధ్యక్షులు సాధు చంద్రశేఖర్,దుగ్గిరాల మండల అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు, తిరుమలశెట్టి మురళీకృష్ణ, సింగంశెట్టి వెంకట్, గంజి రమేష్, పెద్దనేని వేణు తదితరులు పాల్గొన్నారు.

సంచార చిరువ్యాపారులను దోచుకున్న విద్యుత్ సిబ్బంది

విశాలాంధ్ర- కారంపూడి: తిరునాళ్ళ, జాతర జరిగే ప్రదేశాలకు తిరుగుతు ఎండనక, వాననక పిల్లలు, వృద్ధులను వెంటబెట్టుకుని చిరువ్యాపారులు జీవనం సాగిస్తుంటారు. తిరుణాళ్లకు వచ్చి దుకాణాలను ఏర్పాటు చేసుకొని బొమ్మలను అమ్ముతుంటారు. భక్తులు, ప్రజలు జాగారం చేసేందుకు దేవాలయాల వద్దకు వచ్చినప్పుడు బొమ్మలు కొంటుంటారు. రాత్రుళ్లు దుకాణాలకు కరెంటు అవసరం. కరెంటు సప్లయ్ ఇవ్వడానికి విద్యుత్ సిబ్బంది బినామి పేరుతో సుమారు రూ 6 వేలు విద్యుత్ శాఖకు చలానా చెల్లించారు. తిరుణాళ్లలో సుమారు 150 దుకాణాలు మూడు రోజుల పాటు ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కో దుకాణానికి రెండు బల్బులు నుండి 10 బల్బుల వరకు ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఒక్కో బల్బుకు రోజుకు రూ 100లు చొప్పున వసూలు చేశారు. ఒక్కో దుకాణం నుండి రూ 200లు నుండి రూ వెయ్యి రూపాయలు వరకు వసూలు చేసినట్లు దుకాణాదారులు తెలిపారు. ఈ లెక్కన రెండు బల్బులు ఉన్న దుకాణం వద్ద కనీస్ఠంగా రూ 600లు వసూలు చేశారు. గరిష్ఠంగా 10 బల్బులు ఉన్న దుకాణాదారుడు నుండి మూడు రోజులకు రూ 3 వేలు వసూలు చేశారు. ఈ విధంగా చిరు వ్యాపారుల వద్ద నుండి విద్యుత్ సిబ్బంది లక్షల్లో వసూలు చేశారు. ఈ ఏడాది బేరాలు లేక చాలా యిబ్బంది పడుతున్నామని, మా పేరు మీద చలానా కట్టినట్లు కనీస సమాచారం లేదని వారు విలేకర్ల వద్ద వాపోయారు. ఈ విధంగా మమ్ముల్ని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దుకాణదారులు కోరారు.

లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం... ఏఈ కోటేశ్వరరావు

తిరుణాళ్లలో ఏర్పాటు చేసుకున్న దుకాణాలు ముందుగానే విద్యుత్‌శాఖకు చలానా రూపంలో నగదు చెల్లించారు. ఆ మేరకు దుకాణాలకు విద్యుత్‌ను సప్లయ్ ఇవ్వడం జరిగింది. దుకాణాల వద్దకు వచ్చి విద్యుత్ సిబ్బంది డబ్బులు వసూలు చేసినట్లు నా దృష్టికి వచ్చింది. ఎవరైనా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని ఏఈ తెలిపారు.

రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అమరావతి: తుపాను వల్ల నష్టపో యిన రైతులను ఆదుకుం టామని పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకర రావు అన్నారు. అమరావతి మండలం నరుకుళ్లపాడులో మించౌంగ్ తుఫాను వల్ల నష్టపోయిన రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశారు. పంట నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీపై వ్యవసాయ శాఖ ద్వారా శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. అమరావతి మండలంలో మొత్తం 1025 క్వింటాళ్ల శనగ విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. మిచౌంగ్ తుపాను వల్ల అమరావతి మండలంలో మొత్తం 3182 ఎకరాల్లో పంట నష్టం వల్ల 1208 మంది రైతులు నష్టపోయారన్నారు. ప్రభుత్వ సబ్సిడీని వినియోగించుకొని రైతులు మళ్లీ పంటలు వేయాలని సూచించారు. కార్యాక్రమంలో నాయకులు బి.హనుమంతరావు, ఉప సర్పంచ్ నిమ్మా విజయ సాగరు బాబు, కొట హరిబాబు తదితర రైతులు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు బహుమతులు ప్రధానం

విశాలాంధ్ర-అమరావతి: అమరావతిలో జరి గిన ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్-2023 విజేతలకు పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు బహుమతుల ప్రదానం చేశారు. అమరావతిలో షిటోర్యూ ఇంటర్నేషనల్ కరాటే డో అకాడమీ ఇండియా వారి ఆధ్వర్యంలో వరుసగా రెండో ఏడాది ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. అమరావతిలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ ఆవరణలో జరిగగిన ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యాక్రమంలో మాష్టార్ కె.సురేష్, ఉప సర్పంచ్ నిమ్మా విజయ సాగర్ బాబు, ఈద సాంబిరెడ్డి, కొట హరిబాబు, యం.పి.పి.మీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను ముంచిన ముఖ్యమంత్రి

విశాలాంధ్ర-పెదకూరపాడు: 75 తాళ్లూరు గ్రామంలో పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా గోపి ఆధ్వర్యంలో యూత్ జోడో బూత్ జో డో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా గోపి యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి జాబ్ క్యాలెండర్ అంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పి నిరుద్యోగుల ఓట్లతో గద్దెనెక్కి నేడు నిండా ముంచారని అన్నారు. గ్రూప్ వన్, గ్రూప్ టు నోటిఫికేషన్ కి సంబంధించి వయోపరిమితిని 42 నుండి 44 కి పెంచాలన్నారు. మెగా డీఎస్సీ ని ప్రకటించాలని లేని పక్షంలో నిరుద్యోగుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు శివాజీ, తిరుపతిరావు, గోపి, వినయ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలలైనా పూడ్చని గుంతలు

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల పరిధిలోని హుస్సేన్ నగర్ గ్రామం ఆంజనేయ స్వామి గుడి ఎదురు వీధిలో వాటర్ పైప్ లైన్ల నిమిత్తం తీసిన గుంతలు రెండు నెలలైనా పూడ్చలేదని గ్రామ వాసులు తెలిపారు. ప్రధాన రోడ్డు నుండి ఇళ్లల్లోకి వెళ్లే రోడ్డు పగల కొట్టడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు తెలిపారు. రోడ్డు వైపుగా వెళ్లే చిన్నారులు ఆటలాడుతూ గుంతల్లో పడితే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని త్వరితగతిన మరమ్మత్తులు చేపట్టి గుంత పూడ్చాలని కోరారు.

వైసీపీకి పంచాయతీ అధికారుల వత్తాసు

విశాలాంధ్ర-కారంపూడి: అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ తప్పుడు పనులు చేసే పంచా యతి అధికారులను భవిష్యత్‌లో వదిలిపెట్టేది లేదు అని జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్ ఆదివారం హెచ్చరించారు. గత 5 రోజులుగా జరుగుతున్న పల్నాటి వీరారాధన ఉ త్సవాల లో భాగంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఫ్లెక్సీ లు ఏర్పాటు చేయడం జరిగింది. కానీ అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు తొలగించకుండా ప్రతిపక్ష పార్టీల ఫ్లెక్సీలు తొలగించిన పంచాయతీ అధికారులను వదిలిపెట్టేది లేదు అని అన్నారు. ప్రజాస్వామ్యంలో అధికార పార్టీకి ఒక న్యాయం ప్రతిపక్షాలకు ఒక న్యాయం వుండదు అని అందరూ సమానమే ఆయన అన్నారు. తొలగిస్తే అందరి ఫ్లెక్సీలు తొలగించాలని కేవలం ప్రతిపక్ష పార్టీల ఫ్లెక్సీలు తొలగించి అధికార పార్టీ ఫ్లెక్సీలు వుంచడం ఏమిటి అని ప్రశ్నించారు. మరో నాలుగు నెలల్లో టీడీపీ జనసేన ప్రభుత్వం అధికారం లోకి రావడం ఖాయం అని ఇప్పుడు ఎవరు అయితే మా ఫ్లెక్సీలు తొలగించి అధికార పార్టీ కి వత్తాసు పలికే నాయకులు వున్నారో భవిష్యత్ లో మా ప్రభుత్వం రాగానే వాళ్ల చేతనే మా పార్టీ ఫ్లెక్సీలు కట్టిస్తాం అని అన్నారు.

మండల టీడీపీ అధ్యక్షకార్యదర్శులుగా జగ్గయ్య, నాగిరెడ్డి

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండల టిడిపి అధ్యక్షుడిగా రొంపిచర్లకు చెందిన పులుకూరి జగ్గయ్య, ప్రధాన కార్యదర్శిగా అన్న వరప్పాడు గ్రామానికి చెందిన పల్లెల నాగిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు నరసరావుపేట నియోజకవర్గ టిడిపి కార్యాలయం నుండి వారి ని నియమిస్తూ ఆదివారం ప్రకటన జారీచేయటం జరిగింది. నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జ్ డా.చదలవాడ అరవిందబాబు ఆదేశాల మేరకు వారిని నియమించినట్లు టిడిపి నాయకులు తెలిపారు. మండల టిడిపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన జగ్గయ్య, నాగిరెడ్డి లను పలువురు టిడిపి నాయకులు అభినందించారు. మండలంలో టిడిపిని బలోపేతం చేసి, రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో అరవిందబాబు గెలిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. తమ నియామకానికి సహకరించిన వారికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

విశాలాంధ్ర-శావల్యాపురం: కులమతాలకు అతీతంగా ప్రపంచ జనులంతా ఘనంగా చేసుకునే పండుగ క్రిస్మస్ అని పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అలెగ్జాండర్ అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో గల బాపిష్టు చర్చి నందు సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి అందరికీ మంచి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అలెగ్జాండర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఎప్పుడూ ప్రేమను, కరుణను, క్షమాగుణాన్ని కలిగి ఉండాలని బోధించారని తెలిపారు. ప్రతిఒక్కరూ క్షమాగుణంతో సర్వ ప్రాణులను ప్రేమిస్తే యావత్ ప్రపంచం సుఖఃశాంతులతో ఉంటుందని అన్నారు. ఏసుక్రీస్తు చల్లని దయ అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డి సోమశేఖర్, వినుకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయపాటి రామాంజనేయులు, పాస్టర్ రాజేష్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

బాపట్ల జిల్లా

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : స్థానిక కొత్తపేటలో ఉన్న ఓంకార క్షేత్రంలో జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట అంగరంగ వైభవంగా నిర్వహించారు. నగరోత్సవంతో ప్రారంభమై గత మూడు రోజులుగా జరుగుతున్న ప్రతిష్టా మహోత్సవాలు శాంతి కల్యాణోత్సవం నిర్వహించడంతో ముగిశాయి. బ్రహ్మశ్రీ రాజ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో శైవాగమ త్రయాహ్నిక దీక్షతో ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించారు.అనంతరం అన్న ప్రసాద వితరణ కావించారు.ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ,రామకృష్ణ శర్మ, లక్ష్మీ రమణ,ఆలయ అర్చకులు కామేశ్వర శర్మల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఏర్పాట్లు చేశారు.

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేద్దాం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే విజన్ ఉన్న నాయకుడు,తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును రానున్న ఎన్నికలలో అఖండ మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రిని చేద్దామని నియోజక వర్గ తెదేపా ఇంఛార్జి ఎం.ఎం కొండయ్య అన్నారు. పార్టీ కార్యాల యంలో లక్ష్మీ శ్రీనివాస కాలనీకి,విజయనగర్ కాలనీకి చెందిన 40 కుటుంబాల వారు వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కొండయ్య వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వా నించారు.తెదేపా నాయకులు తుమ్మ సుభాన్ రెడ్డి,లావేటి శ్రీనివాస తేజల ఆధ్వర్యంలో ఆసాది శ్రీనివాసరెడ్డి, జై బాబు రెడ్డి,సత్యనారాయణ రెడ్డి,బాలాజీ రెడ్డి, బ్రహ్మారెడ్డి,మణికంఠ రెడ్డి,నాగరాజు,రఫీ, దేవరాజు,శివారెడ్డి, చందు, పోతురాజు,మణి తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. మండలంలోని పాత చీరాల గ్రామస్థులు తెదేపా కార్యాలయంలో కొండయ్యను కలిసి మద్దతు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో తెదేపా యువనాయకులు ఎం.గౌరీ అమర్‌నాథ్,గజవల్లి శ్రీనివాసరావు, కౌతరపు జనార్ధన్ రావు,గంజి పురుషోత్తం, పార్థసారథి,స్థానిక నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా చదవాలి

విశాలాంధ్ర - చీరాల : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు మరో 90 రోజుల్లో రాయబోతున్న 2024 పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.రాజా డెబోరా అన్నారు.ఆదివారం స్థానిక మేధావి కళాశాల ప్రాంగణంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డెబోరా మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో చదివే నిరుపేద విద్యార్థిని విద్యార్థులు మంచి మార్కులే లక్ష్యంగా కృషిచేసి సత్ఫలితాలు పొందాలని సూచించారు.తొలుత బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.స్వాతంత్ర సమరయోధులను స్ఫూర్తిగా తీసుకొని విద్యలో రాణించాలని ఆమె సూచించారు.కార్యక్రమంలో పిల్లలకు ప్రేరణ తరగతులు సబ్జెక్టుల వారీగా విషయ నిపుణుల చేత సూచనలు సలహాలను అందజేశారు.అనంతరం విద్యార్థులకు అభ్యసన సామాగ్రిని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సహాయ సంక్షేమ అధికారి సైదా రెడ్డి, సబ్జెక్ట్ నిపుణులు పవని భానుచంద్ర మూర్తి,రాణెమ్మ,ఎల్.శ్రీనివాసరావు,సత్యానందం,పాలేటి సురేష్,హాస్టల్ వార్డెన్లు,చీరాల, పర్చూరు,ఇంకొల్లు ప్రాంతాల వసతి గృహాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

విశాలాంధ్ర - చీరాల : క్రీస్తు మార్గం అనుసరణియమని ప్రతి ఒక్కరు సోదర భావంతో మెలగాలని ప్రజావేదిక రాష్ట్ర కార్య దర్శి గుమ్మడి ఏసు రత్నం అన్నారు.క్రిస్టమస్ పండుగ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు బహుకరించిన చీరలను పేదలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గుమ్మడి ఏసురత్నం,పాస్టర్ రెవరెండ్ గుమ్మడి రత్నప్రకాష్‌లు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగ అందరు కలిసి మెలసి ఉండాలని క్రీస్తు చూపిన ప్రేమ మార్గంలో నడవలన్నారు. తదనంతరం విఘ్నేశ్వర కాలనీలోని సీయోను సహవాస ప్రార్థన మందిరంలో నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరించి,పేదలకు చీరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ దేవరపల్లి డేవిడ్‌లుక్,చిట్టమ్మాయి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హరే రామ నామ సంకీర్తన సప్తాహం ప్రారంభం

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని వింజనం పాడు గ్రామంలో వెంచేసి యున్న శ్రీ సీతారామస్వామి వారి దేవాలయంలో అఖండ హరే రామ నామ సంకీర్తన సప్తాహం ఘనంగా ప్రారంభించారు. గత 70 సంవత్సరాలుగా గ్రామంలో ప్రతి ఏడాది గ్రామంలో సప్తహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,ఈ నెల 24 వరకు కార్యక్రమం జరుగుతుందని ఆలయ పాలకవర్గం తెలిపారు. సప్తహ కార్యక్రమాన్ని శ్రీ సద్గురు అవధూతేంద్ర భక్తమండలి ప్రధాన కార్యదర్శి పి.శ్రీరామ్ ఆధ్వర్యంలో వారి శిష్యులు గంటా కోటేశ్వరరావు సేవతో సప్తహక దీక్ష జరుగుతుందని గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : ఇటీవల కూర్చున్న తుఫాన్ ప్రభావం పూర్తిగా పంటలను కోల్పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మండలంలోని రైతులు కోరుతున్నారు. మండలంలో చిలుకూరివారిపాలెం, యద్దనపూడి, అనంతవరం, వింజనంపాడు, గ్రామాలలో పొగాకు పంటను సాగు చేసి రైతులు పూర్తిగా నష్టపోయినట్లు తెలిపారు. ఎకరానికి 30 వేలు పెట్టుబడి పెట్టగా , 30 వేలు కౌలుతో ఎకరానికి 60 వేలు వరకు ఖర్చైందని రైతు కమ్మ పద్మారావు తెలిపారు. 8 ఎకరాల వరకు పొగాకు పంటను సాగు చేయగా తుఫాన్ ప్రభావంతో పొలంలో నీరు నిలబడి ఉరకేత్తి గడ్డి పెరిగి ఏమి చేయాలో తెలియక దిక్కు తోచని స్థితిలో ఉన్నామన్నారు. నాలుగు లక్షల పైగా ఖర్చు అయినట్లు తెలిపారు. రైతులు రావూరి హరిబాబు, అద్దేటి గోవర్ధన్, రైతులు 20 ఎకరాలు పొగాకు సాగు చేశామని తుఫాన్ ప్రభావంతో పూర్తిగా నష్టపోయినట్లు తెలిపారు. ప్రభుత్వం పంట నష్టపరిహారాలను నమోదు చేసుకొని తగిన పరిహారం రైతులకు అందజేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - రేపల్లె : అంగన్వాడీల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని విడనాడి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు డిమాండ్ చేశారు.స్థానిక తాసిల్దార్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె ఆరో రోజుకు చేరుకుంది.నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం తాలూకా ప్రధాన ద్వారం వద్ద అంగన్వాడి మహిళలు పొర్లు దండాలు పెడుతూ తన సమస్యలను పరిష్కరించాలంటూ నినాదాలు చేయగా, తమ సమస్యల పట్ల ముఖ్యమంత్రి మనస్సు కరిగించేలా చేయాలంటూ ముస్లిం మహిళలు నమాజ్ చేశారు. ఆరు రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్యల పరిష్కారానికి చొరవ చూప కుండా అంగన్వాడీల పట్ల ప్రభుత్వం బెదిరింపులకు పాల్ప డటం దుర్మార్గమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు నిరవధిక సమ్మెను విరమించేదే లేదంటూ నాగాంజనేయులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టు ముక్కల బాలాజీ మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్బంధాన్ని ప్రయోగించటం తగదని,గత ఎన్నికలకు ముందు అంగన్వాడి లకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సామ్రాస్య పూర్వక వాతావరణంలో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యమంత్రికి లేఖ పంపినట్లు బాలాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కన్వీనర్ జి.నాగమల్లేశ్వరమ్మ, వై.దుర్గా, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై కనికరం లేని సీఎం: శ్రీధర్

విశాలాంధ్ర - బాపట్ల : డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ ఆడబిడ్డలు రోడెక్కి నిరసన తెలుపు తున్న సీఎం జగన్మోహన్ రెడ్డికి ఏ మాత్రం కనికరం లేదని సీపీ ఐ జిల్లా సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్ విమర్శిచారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు గత ఆరు రోజులుగా ధర్నా చేస్తున్న అంగన్వాడీ టీచర్లకు,ఆయాలకు సీపీఐ నాయకులు సంఘీభావం తెలిపారు.ఈ సంద ర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ జగన్ ప్రతిపక్షంలో ఉన్న ప్పుడు 341 రోజులు పాటు 3648 కిలోమీటర్లు ప్రజా సంకల్ప యాత్ర పేరుతో పాదయాత్ర చేసి అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలు నట్టేట ముంచారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవ త్సరాలు అవుతున్న రైతులను, కూలీలను, ఉద్యోగస్తులు, అంగన్వాడీలను, ఆశా వర్కర్లు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులను ఎవరిని పట్టించుకోకుండా వారి సమస్యలను తీర్చకుండా ఓట్లతో అధికారంలోకి వచ్చి జగన్ రాజభోగాలు అనుభవిస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రూ. 26000 జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.12 వేలు జీతాలు ఇస్తూ అదనపు భారాలు వేస్తూ వారి జీవితాలతో ఆటలు ఆడుతు న్నాడన్నారు. అంగన్వాడీల ఉద్యమంకు సీపీఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంఘీభావంతో ఉధృతం చేసి ప్రభుత్వ పతనానికి అంగన్వాడి మహిళలే మొదటి ఓటు వేయాలని శ్రీధర్ పిలుపునిచ్చారు. అంగన్వాడీల న్యాయమైన కోరికలు తీరే వరకు నిత్యం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి బత్తుల అశోక్ పాల్గొన్నారు.

మీతోనే మా ప్రయాణం..

- వైసీపీని వీడి టీడీపీ బాట పడుతున్న యువత
- పార్టీ కండువాలతో ఆహ్వానించిన వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : గత నాలుగేళ్లగా మమ్మును పట్టించు కున్న నాధుడే లేడు. వైసీపీలో చురగ్గా పని చేశాం మాకు మా గ్రామానికి ఏదైన అభి వృద్ధి చేస్తారని ఆశించాం ఆరాట పడ్డాం కానీ చేసేందేమీ లేదు. ఎన్నికలు వచ్చేస్తున్నాయి మళ్లీ గెలిపించమని అడు గుతున్నారు మా వల్ల కాదని కరాఖండిగా చెప్పాం. వైసీపీని గెలుపించుకుని గ్రామాన్ని అభివృద్ధి చేసుకోలేక పోయాం మీతోనే కలిసి నడవాలని నిశ్చయించుకున్నాం అడగకుండానే ఆపద అవసరం ఉంటే ఆర్థికంగా చేయూ తనిచ్చి అదుకుని భరోసా కల్పించారు మిమ్ము ను ఎమ్మెల్యేగా గెలిపించుకుని మీ గ్రామాన్ని అభివృద్ధి చేసు కునేందుకు మీతో వచ్చాం అంటూ బాపట్ల మండలం చింతావారిపాలెం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 25 మంది యువకులు టీడీపీ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో పార్టీ కండువా కప్పుకుని టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వేగేశన మాట్లాడుతూ యువత చేతుల్లోనే రాష్ట్ర దేశ భవిష్యత్తు ఉంది. గాడి తప్పిన పాలనను గాడి పెట్టాలంటే యువత ఓటుతో చంద్రబాబును నన్ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు. అభివృద్ధి అనేది లేకుండా ప్రజలను తప్పుదోవ పెట్టించే విధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిన జగన్ ప్రభుత్వాన్ని సాగనం పుదాం అన్నారు. సైనికుల్లా పనిచేయండి చంద్రబాబును గెలిపించుకోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామ న్నారు. అనంతరం పార్టీలో జాయిన్ అయిన యువత మాట్లాడుతూ మా గ్రామం కోసమే మేము పార్టీలో చేరామని ఎవరూ బలవంతపు ఒత్తిడి లేదని మాకు మంచి జరుగుతుందని వేగేశన వెంట ఉండాలని వచ్చామన్నారు. అనంతరం గ్రామ విషయాలపై గ్రామ మాజీ ఎంపీటీసీ జాన్‌వెస్లీ, కాగిత జోసఫ్‌లతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట నారాయణ,ముక్కామల సాంబశివరావు, మోదుగుల శంకర్‌రెడ్డి,మద్దాల మునలయ్య, వడ్లమూడి వెంకటేశ్వర్లు,కావూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయమని ట్రైనీ డీఎస్పీ టి.విద్యా శ్రీ అన్నారు.మండల పరిధిలోని ఆలకాపురం గ్రామంలో దాత, ఆ గ్రామ సర్పంచ్ గంగరాజు సహకారంతో ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలను ఆయనతో కలిసి డీఎస్పీ ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ దాత, ఆ గ్రామ సర్పంచ్ గంగరాజు సహకారంతో గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం అందించిన దాత, ఆ గ్రామ సర్పంచ్ గంగరాజు కు ట్రైనీ డీఎస్పీ టి.విద్యా శ్రీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.నేరాల నియంత్రణ, నేరస్థులను గుర్తించుటలో సీసీ కెమెరాలు కీలకంగా పని చేస్తాయన్నారు.సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా క్రైమ్ రేటు తగ్గించవచ్చని, నేరాలు అదుపులోకి వస్తాయని, ఒక్కో సీసీ కెమెరా 100 మంది పోలీసులకు సమానమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చందోలు ఎస్ఐ రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్లలో వైసీపీ అభివృద్ధి శూన్యం

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్లలో వైసీపీ చేసిన అభివృద్ధి శూన్యమని టీడీపీ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పట్టణంలోని 10వ వార్డు ప్యాడిసన్ పేటలో ఇంటిం టికీ తెలుగుదేశం మీ మాట నా బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి పార్టీ విధానాలను వివరిస్తూ భవిష్యత్తు గ్యారెంటీ సంక్షేమ పథకాలు గురించి వేగేశన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బాపట్లను జిల్లా చేశామని అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకోవడమే కానీ చేసింది ఏమి లేదన్నారు. పట్టణంలో వార్డులో ఇంటికి ఇంటికి వెళ్లి ప్రజలను సమస్యలను అడుగుతుంటే డ్రైనేజీ, పారిశుధ్యం, విద్యుత్ స్థంబాలు, రోడ్డులు వేయలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారన్నారు. రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని ఆశీర్వదించి ఓటు వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - బాపట్ల : స్థానిక మార్కెట్ యార్డ్ ఎదురుగా ఉన్న నిరుపేదలకు హలో ప్రేయర్ టవర్ వ్యవస్థాపకులు రెవ గుమ్మడి ఆనంద్ బాబు ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆదివారం దుప్పట్ల పంపిణీ చేశారు. అనంతరం క్రిస్మస్ సందేశం ప్రకటించి ప్రార్థన చేశారు. రాబోవు రోజుల్లో నిరుపేదలకు ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డర్ వై. ఏబు, ఇవాంజెలిస్, యారం శేఖర్ బాబు, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

మానవుని కోసం జన్మించిన క్రీస్తు

విశాలాంధ్ర - కర్లపాలెం : లోకంలోని ప్రతి మానవునికి కోసం ఏసుక్రీస్తు జన్మించారని కేర్ మినిస్ట్రీస్ అధినేత మోపర్తి జాన్ తెలిపారు. మండలంలోని పేరలి గ్రామంలో ఆల్ పీపుల్ జేఏసీ యూత్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోపర్తి జాన్ మాట్లాడుతూ మానవుడు చేసే చెడు క్రియలతో పాపిగా మరణం పొందుతారని మానవుని పాపాలను ప్రాయచిత్తంగా చేసి మంచి వ్యక్తిగా జీవించాలన్నదే బైబుల్ సందేశం అన్నారు. క్రైస్తవ్యం ఏ మతానికో కులానికో చెందినది కాదని తప్పులు పాపాలను విడిచి మంచి మార్గంలో నడవాలని సూచించేదే అన్నారు. చిన్నారులు చేసిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాణాసంచా వెలుగులతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాగిత వీరన్న, మేకల శ్రీను, జోగి సురేష్, జోగి రాజేష్, దాసరి బాబురావు, మణి, పండు, రాము, విజేష్, బెంజిమేన్ తదితరులున్నారు.

భారీ మెజారిటీతో గెలుస్తా: హనిమిరెడ్డి

విశాలాంధ్ర-అద్దంకి : అందరి సహకారంతో వచ్చే ఎన్నికల్లో వైసీపీ తరపున భారీ మెజారిటీతో గెలిచి అద్దంకి నుంచి చాలా ఈజీగా గెలవచ్చని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు నిరూపిస్తానని నియోజకవర్గ వైసీపీ నూతన ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హని మిరెడ్డి ఆదివారం సింగరకొండ శ్రీప్రసన్నాంజ నేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీడీడి కళ్యాణ మంపడపంలో జరిగిన సభలో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ తాను టీడీడి మాజీ చైర్మన్ వైవి,సుబ్బారెడ్డి విద్దేయుడునన్నారు.తాను అద్దంకి లోనే ఇల్లు నిర్మించుకొని కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కొరకు ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి వైస్,జగన్‌ను త్వరలో అద్దంకి తీసుకువస్తానన్నారు. ఎవ్వరికీ భయపడకుండా ఎవరి వ్యాపారాలు వారు ప్రశాంతంగా చేసుకోవచ్చ న్నారు. తాను 25 ఏళ్ళ క్రితం చాలా నిరుపేదనని,ప్రస్తు తం 13 రాష్ట్రాల్లో కంపె నీలు నెలకొల్పి 1600 మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. తన కంపెనీలలో అద్దంకి ప్రాంత నిరుద్యోగు లకు ఉపాధి కల్పిస్తానన్నారు. మండల, గ్రామాలలో పర్యటించి కార్యకర్తలను స్వయం గా కలుసుకుంటానన్నారు. అన్నింటికీ సిద్ధపడే అద్దంకి నుంచి వైసీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించినట్లు హని మిరెడ్డి తెలిపారు. హనిమిరెడ్డికి జాతీయ రహదారి కొండమంజలూరు టోల్‌ప్లాజా నుంచి సింగరకొండ వరకు భారీగా కార్యకర్తలు స్వాగతం తెలిపారు. కార్య కర్తల సమావేశానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివచ్చి హనిమిరెడ్డితో కరచాలంకు పోటీ పడ్డారు. సమావేశానికి అద్దంకి పట్టణ వైసీపీ అధ్యక్షులు కాకాని రాధాకృష్ణమూర్తి, కౌన్సిలర్‌లు వైకుంఠ సుబ్బ రావమ్మ, ముడం అరుణ రామ్‌గోపాల్‌రెడ్డి, వైసీపీ నాయ కులు సింగరకొండ మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ కోట శ్రీనివాసకుమార్,బివి,కృష్ణారెడ్డి ,సంతమాగులూరు జడ్‌పిటిసి అడవి శ్రీనివాసరావు,జజ్జర ఆనందరావు, గూడా శ్రీనివాసరెడ్డి,చిన్ని శ్రీమన్నారాయణ,ఈదా శ్రీనివాసరెడ్డి తదితరులు హాజరయ్యారు.

మత్స్యకార సంఘం మహాసభలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - రేపల్లె : ధనార్జనేధ్యేయంగా పనిచేస్తున్న సంస్థలకు సముద్ర తీర ప్రాంతాలను అప్పగించటం ద్వారా మత్స్యకారుడు జీవనోపాధిని కోల్పోతూ పొట్ట చేత పట్టుకుని వలసలు పోతున్నారని మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ పి నాగాంజనేయులు అన్నారు. ఈనెల 23న విశాఖపట్నంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం ఇసుకపల్లి సంతలో కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగాంజనే యులు మాట్లాడుతూ రాష్ట్రంలో 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి అవసరమైన చోట్ల షిప్పింగ్ ఆర్బర్ లను నిర్మిస్తామని వాగ్దానం చేసి నాలుగున్నర ఏళ్లు గడచిపోయిందన్నారు. తీర ప్రాంతాల్లో 3500 కోట్ల వ్యయంతో మెరైన్ ఇన్ ఫ్రాక్చర్ నిర్మించి వలసలను శాశ్వతంగా నివారిస్తామని చేసిన వాగ్దానాలు సముద్రపు నీటిలో కలిసిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశా రు. ఈ కారణంగా ఇతర ప్రాంతాలకు చేపల వేట కోసం వలస వెళ్లిన వారిలో అనేకమంది దారి తప్పి పాకిస్తాన్ బంగ్లాదేశ్ శ్రీలంక సముద్రపు జలాల్లోకి ప్రవేశించి ఆయా దేశాల్లో అనేకమంది జైలలో మగ్గుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలాది గ్రామాల్లో మత్స్యకారులు చేపల వేటతో జీవన ఉపాధి పొందే అవకాశం ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లప్తతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు జెట్టీలు కల్పిస్తామని మత్స్యకారులకు అధికార పార్టీ నాయకులు చెబుతున్న మాటలు నీటి మూటలుగా మారాయని ఆయన చెప్పారు. ఎక్కడికక్కడ జట్టీలు నిర్మిస్తే వ్యాపార అవకాశాలు మెరుగుపడి దళారీల దోపిడీ తగ్గి మత్స్యకారుల జీవితాల్లో ఆర్థికపరమైన మార్పులు వస్తాయని నాగాంజనేయులు తెలిపారు. రాష్ట్రంలో 970 కిలోమీటర్ల పొడవైన సముద్ర ప్రాంతం ఉంది ఈ ప్రాంతాల్లోని మత్స్యకారుల జీవనం సముద్రం పైనే ఆధారపడి ఉందని ఆయన అన్నారు. సముద్ర తీరంలోకి చమురు గ్యాస్ నిక్షేపాల ద్వారా సముద్రంలో రసాయనాలు కాలుష్యం ఏర్పడటం వలన గత కొన్ని సంవత్సరాలుగా తీర ప్రాంతంలో మత్స్య సంపద క్షీణించి పోతుందని నాగా ఆంజనేయులు అన్నారు. ప్రతి ఏడాది రెండు మాసాలపాటు చేపల వేటను నిషేధించడంతో మత్స్యకారులు ఆర్థికపరమైన ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలంలో ప్రభుత్వం మత్స్యకార భరోసా కింద కుటుంబానికి పదివేల రూపాయలు అందించి చేతులు దులుపుకుంటేనే ఆయన విమర్శించారు. రెండు నెలల కాలం పాటు కుటుంబ జీవనానికి 10వేలు ఏ విధంగా సరిపోతాయని ఆయన ప్రశ్నించారు. మత్స్యకార కుటుంబాలను పూర్తిస్థాయిలో ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని నాగాంజనేయులు అన్నారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించి భవిష్యత్తు కార్యచరణను రూపొందించుకునేందుకు ఈనెల 23న జరుగుతున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసేందుకు మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రేపల్లె ఏరియా గౌరవ అధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ జి. నాగమల్లేశ్వరమ్మ, శ్రీలేఖ, కనకదుర్గ, సమ్మెట శ్రీనివాసరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి అమానుషం

విశాలాంధ్ర - బాపట్ల : బడుగు బలహీన వర్గానికి చెందిన మహిళపై దాడి చేయడం అమా నుషమని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్డి భాగ్య శ్రీధర్ పేర్కొన్నారు. కాకుమాను మండ లం కొండపాటూరు చెందిన నిడుబ్రోలు శివలక్ష్మిను ఆ గ్రామానికి చెందిన అగ్రకులస్తుడు పి.బ్రహ్మాజి దాడి చేసి కొట్టడంతో బాధితురాలు బాపట్ల ప్రభుత్వ ఏరియా వైశాలలో చికిత్స పొందుతుదన్నారు.వైద్య చికిత్స పొందుతున్న శివలక్ష్మీను పరామర్శించి దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.కొండపాటూరులోని దోభిఖానా స్థలములో నివాసం ఉంటున్న వేరే కులస్తుల తరుపున బ్రహ్మాజి వచ్చి తనను అమానుషముగా దూషించి వారిపై అక్రమ కేసులు బనాయించే ప్రయత్నం చేశారాన్నారు.ఎస్ఐ న్యాయపరమైన విచారణతో బాధితులను విడిచిపెట్టగా పోలీస్ స్టేషన్‌లోనే వారిపై బ్రహ్మాజి దాడికి దిగటం శోచనీయమన్నారు.ఆ దాడిని ఎస్ఐ నిలువరించి ఇరుపక్షాల వారిని పంపించేశారని, గ్రామానికి వచ్చిన శివలక్ష్మి ఇంటిలోకి బ్రహ్మాజి వెళ్లి దాడి చేయడంతో పాటు అసభ్యకరమైన పదజాలంతో దూషించి జుట్టు పట్టుకుని బయటికి లాక్కు రావటం జరిగిందని వివరించారు.తీవ్రంగా గాయపడిన శివలక్ష్మిని అర్ధరాత్రి బాపట్ల ప్రాంతీయ వైద్యశాలకు తీసుకురాగా వైద్యులు చికిత్స అందించారన్నారు.ఇలాంటి దాడులు మరోసారి జరగకుండా ఎంపీటీసీ భర్త బ్రహ్మాజీపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు జెల్డి భాగ్య శ్రీధర్ బాపట్ల నియోజకవర్గం ఏఐటియుసి కార్యదర్శి మామిడిబత్తుల అశోక్ బాధితురాలని పరామర్శించి వారికి అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చారు.

నష్టపోయిన పంటల పరిశీలన

విశాలాంధ్ర - పర్చూరు : తుఫాను వలన కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలను జిల్లా వ్యవసాయ అధికారి అబ్దుల్ సత్తార్ పర్చూరు మండలంలోని చెరుకూరు, రమణాయపాలెం, పోతుకట్ల గ్రామాలలో దెబ్బతిన్న పొగాకు, మిరప, మినుము, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. పర్చూరు మండలంలో పొగాకు 13000 ఎకరాలు, మొక్కజొన్న 700 ఎకరాలు, మినుము 125 ఎకరాలు , పెసర 120ఎకరాలు, మిరప 2800 ఎకరాలు, వరి 600 ఎకరాలు వరకు నష్ట పోయినట్టు అంచనా వేయడం జరిగిందని జిల్లా అధికారి అబ్దుల్ సత్తార్ తెలిపారు. అన్ని రైతు భరోసా కేంద్రాలలో పంట నష్టపోయిన రైతులు యొక్క వివరాలు నమోదు చేస్తున్నాము అని జిల్లా వ్యవసాయ అధికారి తెలియజేయడం జరిగింది. వీరి వెంట మండల వ్యవసాయ అధికారి ఎస్ రామ మోహన్ రెడ్డి, రైతు భరోసా సిబ్బంది, రైతులు ఉన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు తుపాన్ ట్రస్ట్ సాయం

విశాలాంధ్ర - నిజాం పట్నం : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో తుపాన్ చారిటబుల్ ట్రస్ట్ ఎప్పుడు ముందుం టుందని ట్రస్ట్ ట్రెజరర్ దబ్బకూటి బసవరాజు అన్నారు.ఇటీవల నగరం మండలంలోని మీసాలవారిపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీలో సంభవించిన అగ్నిప్రమాదంలో మూడు పూరిళ్లు పూర్తిగా దగ్ధం అయ్యాయి.దీంతో నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు తుఫాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యవసర వస్తువులు, వంట సామాగ్రి, బట్టలు, దుప్పట్లు, చట్నీ బాటిల్స్, కూరగాయలు తదితర సామాగ్రిని ట్రస్ట్ సభ్యులు ఆదివారం అందజేశారు.ఈ కార్యక్రమంలో తుఫాన్ చారిటబుల్ ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ పిన్నిబోయిన లక్ష్మి నరసమ్మ, ట్రస్ట్ సభ్యులు ఆలపాటి కృష్ణ కూమార్, మాజేటి విజయకుమార్, ఎన్.వెంకటరమణ, ఎన్.నరసింహారావు, జేమ్స్ బాబు (డీసీ) తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - బాపట్ల : పాండురంగపురం సము ద్ర తీరాన బాపట్ల జిల్లా మాజీ సైనికుల వార్షిక ఆత్మీయ సమ్మేళనం జిల్లా అధ్యక్షులు తాంధ్ర సాంబశివరావు అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీ తాంధ్ర మాట్లాడుతూ సరిహద్దులలో దేశ రక్షణ కోసం సేవ చేసిన సైనికులుగా అంతర్గతంగా దేశంలోని ప్రజలకు సేవలు చేస్తున్న ప్రతి ఒక్కరిని గౌరవించుకోవాలనే ఆలోచనతో, సేవాతత్పరులైన భారతీయులను, మాజీ సైనికుల వార్షిక ఆత్మీయ సమ్మేళనంలో సత్కరించుకోనే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఈ ఏడాది జిల్లాలో రెడ్ క్రాస్ సంస్థ ద్వారా జిల్లా ప్రజలకు సేవ చేస్తున్న నారా యణ బట్టుని సన్మానించుకోవటం ఆనందంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం కుటుంబ సభ్యుల తో కలిసి మాజీ సైనికుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసు కోవటం సంతోషదాయకమన్నారు. మాజీ సైనికులకు, మహి ళలకు, పిల్లలకు ప్రత్యేకమైన క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి బహుమతులు ప్రధానం చేశారు. ప్రత్యేక ఆహ్వానీతులుగా నిజాంపట్నం యూని యన్ ప్రెసిడెంట్ సుల్తాన్, చెరుకుపల్లి యూనియన్ ప్రెసిడెంట్ సుబ్బారావు, తెనాలి యూనియన్ సెక్రటరీ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్



విశాలాంధ్ర - బాపట్ల : కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుంటూరు రోడ్‌లో ఉన్న ఏబీఎన్ గ్రౌండ్స్‌లో ఆదివారం రాత్రి వైభవంగా జరిగాయి. స్తుతి ఆరాధన క్రిస్మస్ సందేశం, క్రిస్మస్ గీతాలు క్రిస్మస్ అలంకరణ, విద్యుత్ దీపాలతో ప్రాంగణం ముచ్చటగా ఉంది. ఆధ్యాత్మిక సాంస్కృతి కార్యక్రమాలు క్యాండిలైట్ సర్వీస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతర్జాతీయ సువార్తికులు పాల్ దినకరన్ వాక్యోపదేశం చేశారు. పాల్ దినకరన్ ప్రసంగిస్తూ క్రీస్తు ప్రేమ ప్రతి మానవునిపై ఉంటుందని క్రీస్తు ప్రేమను పొందేందుకు చెడుని విడిచి మంచి మార్గంలో పయనించాలని బోధించారు. రమ్మనుచున్నాడు నిన్ను ప్రభు యేసు అనే గీతాన్ని ఆలపించారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించాలనే బైబిలు సూక్తిని స్ఫూర్తిగా తీసుకుని తన ప్రజా జీవితంలో ప్రతీ అడుగు వేశానని తెలిపారు. మన వలే మన పొరుగు వారిని ప్రేమించాలని, ఒక వైపు బైబిల్, మరోవైపు తండ్రి కోన ప్రభాకర్ రావు నింపారన్నారు. తనను తాను తగ్గించుకొను వాడు హెచ్చింపబడుతాడనే సూక్తిని అనుసరించి, ప్రజా జీవితంలో అనునిత్యం అందరితో ప్రేమగా మెలగడం నేర్చుకున్నారని చెప్పారు. డాక్టర్ పాల్ దినకరన్ ఆధ్వర్యంలో నడపబడుతున్న కారుణ్య విద్యాసంస్థల అభివృద్ధికై తన వంతుగా రూ. 10 లక్షల విరాళాన్ని అందజేస్తున్నట్లు ప్రకటించారు.